
# ప్రజా ప్రతినిధులు

వి.వి.ఎల్.సావిత్రి

ఉదయం పదిగంటలైంది. ఎండ చుర్రుమంటోంది. అందుకు తార్కాణంగా అసెంబ్లీ ముందున్న బీటు కానిస్టేబులు చాలా అసహనంగా కదులుతున్నాడు. ఒక ప్రవాహంలా వస్తున్న ట్రాఫిక్‌ని కంట్రోల్ చేసి. చేసి నీరసించిపోయాడు. అసెంబ్లీ ముందు లాన్‌లో ఉన్న సుబ్బరాజు పరిస్థితీ ఇంచుమించు అలాగే ఉంది. తానొక ధ్యేయంతో ఈ మహా పట్టణానికి వచ్చాడు. ఆ మహత్కార్యాన్ని పూర్తి చేసుకుని మళ్ళీ తన వూరు వెళ్ళిపోవాలి. అటువైపుగా అసెంబ్లీ సెంట్రల్ హాల్ ద్వారం వైపుకి కార్లన్నీ దూసుకుపోతున్నాయ్. కారుల్లోంచి దిగే ఎమ్మెల్యేలకు, మంత్రులకు వారి వారి బాడీ గార్డులు పరిగెత్తుకుంటూ వచ్చి సలాం చేసి వెనక నిలబడుతున్నారు. అంతా హడావిడిగా ఉంది. సుబ్బరాజుకి టెన్షన్‌గా ఉంది. తానే మాత్రం అప్రమత్తంగా ఉన్నా వచ్చిన పని జరగదు. అందుకే కిళ్ళీ నములుతూ ఒక కండువా భుజాన వేసుకుని చేతి సంచీతో నీలిరంగు అంబాసిడర్ కారు కోసం ఆత్రంగా ఎదురు చూస్తున్నాడు. సుబ్బరాజు వాళ్ళ ఊళ్ళో చిన్నపాటి నాయకుడు . ఆ వూరికున్న మొత్తం ఓట్లలో అరవై శాతం వరకూ తనవైపు తిప్పుకోగలడు. బుర్రమీసాలతో చక్కటి శరీర సౌష్టవంతో జబర్దస్తీగా వుండే సుబ్బ రాజుని అడుగు, బడుగు జనాలు ప్రాణంగా చూసుకుంటారు. గౌరవిస్తారు. అందుకే ఆ వూరికి ఎవరు వచ్చినా ముందుగా సుబ్బరాజుని కలుస్తారు. మొన్న సంక్రాంతి పండుగ ముందొచ్చిన ఎలక్షన్లలో దగ్గరుండి మరీ సదానందాన్ని గెలిపించాడు. సుబ్బరాజు చాకచక్యం, మాటకారి తనం చూసి ఎమ్మెల్యే సదానందమే యమాగా ఆశ్చర్యపోతాడు.



అలా చెట్టుకింద నిలబడి చూస్తుండగానే నీలిరంగు అంబాసిడర్ కారు దూసుకొచ్చి ఆగింది. సుబ్బరాజు ఎలర్ట్ అయిపోయాడు. నములుతున్న కిళ్ళీని పక్కన ఉమ్మేసి నోరు తుడుచుకుని చంకలో సంచీతో కారు దగ్గరకి పరుగు తీశాడు. సుబ్బరాజుని చూడగానే సదానందం ఆశ్చర్యపోయాడు.

"నువ్వటోయ్! చెప్పినట్టుగానే వచ్చావన్న మాట! వెరీ గుడ్! మీ సమస్య గుర్తుంది. తప్పనిసరిగా రైజ్ చేద్దాం. రావోయ్ కాంటీన్‌కు వెడదాం పట్నం కాఫీ రుచి చూద్దువుగాని" అంటూ భుజం చుట్టూ చెయ్యి వేసి కాంటీన్‌కు తీసుకుపోయాడు.

సుబ్బరాజు మనసు కృతజ్ఞతతో నిండిపోయింది. ఉబ్బితబ్బిబ్బై పోయాడు. సదానందం ఇప్పించిన కాఫీని తృప్తిగా తాగి నిలబడ్డాడు.

"రాజూ! సిటీ చూసావా?" అడిగాడు సదానందం.

"లేదు బాబుగోరు! నా ముక్యమైన పని అయిపోతే తప్ప మరేం సూడదల్చుకోలేదు. అక్కడ మా పానం మీదకి వచ్చేత్తంది కదండీ! మీరు దయ తలచి ఆ సమస్య పరిస్కారం సేస్తే జెమ్మ జెమ్మలకీ తవరి పేరు సెప్పుకుంటాం అయ్యా! " వినయంగా అన్నాడు సుబ్బరాజు.

"ఏం బెంగలేదోయ్! అసలు నా పనితీరు, పట్టుదల నువు చూళ్ళేదు కదూ! నే చెప్పడం ఎందుకూ! ఏకంగా చూద్దుగానీలే. అసెంబ్లీ అంటే మాటలా! ప్రభుత్వాన్ని నిలదీస్తాం.పనులు జరిపిస్తాం. ప్రసంగాలు చేస్తాం. మీకోసం కష్టపడతాం. ఓహ్! చాలా పెద్ద కథ అది . ఇదిగో...ఓ ఎంట్రీ పాస్ రాయించు" పక్కనున్న పి.ఎ.కి పురమాయించాడు. పదినిమిషాల్లో పట్టుకొచ్చాడు పి.ఎ. రాజూ!

"ఈ పాస్ తీసుకుని విజిటర్స్ గాలరీలో కూర్చో! ఈ వేళ అసెంబ్లీ ఎలా జరుగుతుందో మన తడాఖా ఏంటో చూద్దుగానీ!" అన్నాడు సదానందం.

"అలాగే సామీ!" ఆ పాస్‌ని కళ్ళకద్దుకుని గ్యాలరీ వైపు నడిచిపోయాడు సుబ్బరాజు.

సుబ్బరాజుకి తెలివి తేటలు పెద్దగా లేకపోయినా నాయకత్వ లక్షణాలు మెండుగా వున్నాయి. అదిలించైనా తన మాట నెగ్గించు కోగలడు. అందుకే ఊరి వాళ్ళందరూ చందాలు వేసుకుని సుబ్బరాజుని పట్నం పంపారు. ఆ ఊరికో సమస్య ఉంది. అక్కడ వర్షాలు లేక పంటలు ఎండి పోతున్నాయి. భూములు ఎండిపోయి పంటలు పండక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఆ పరిస్థితిని చక్కదిద్దాలంటే చుట్టుపక్కల ఉన్న నదినుండి నీటిని పంట కాల్వల్లోకి మళ్ళించాలి. అది ప్రభుత్వమే చేయగలదు. సంబంధిత ఎమ్మెల్యే పట్టుపడితే ఆ సమస్య తప్పకుండా పరిష్కారమవుతుంది. అందుకే ఆ సమస్యని తమ ఎమ్మెల్యే ద్వారా అసెంబ్లీలో చర్చకి పెట్టించాలని సుబ్బరాజు ఆతృత. తను గట్టిగా రెండు సార్లు సదానందానికి కనపడి సమస్యని వివరిస్తే పని అయిపోతుంది. అందుకే సుబ్బరాజు ఆరాటం.

****   ****

అసెంబ్లీ మొదలైంది. సభ్యులంతా ఒకళ్ళనొకళ్ళు ఆప్యాయంగా పలకరించుకుని కరచాలనం చేసుకుంటున్నారు. మహిళా శాసన సభ్యులు అలవాటు ప్రకారం నగలు, ఆభరణాలు, జరీ చీరల సమాచారం మాట్లాడుకుంటున్నారు. అపుడే స్పీకర్ సభలోకి అడుగుపెట్టాడు. విజిటర్స్ గ్యాలరీలో కూర్చున్న సుబ్బరాజుకి చలి మొదలైంది. 'ఈ చల్లటి గదుల్లో కూర్చోబట్టే ఈనా కొడుకులకి పెజల సమస్యలు ఆనటం లేదు ' మనసులో కసిగా తిట్టుకున్నాడు.

ముందుగా ఓ దివంగత నాయకుడికి సభ అంజలి ఘటించింది. ఆ తర్వాత శాసన సభ నాయకుడైన ముఖ్యమంత్రి లేచి ప్రభుత్వ విధానాలని వివరించాడు. సభ్యులందరూ ఎవరి పనుల్లో వాళ్ళున్నారు. వెనక వరసలో వున్న ఇద్దరు సభ్యులు పళ్ళన్నీ కనిపించేలా నవ్వుకుంటూ పిచ్చాపాటీ కబుర్లలో పడ్డారు. ముఖ్యమంత్రి మాట్లాడినంతసేపూ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు అడ్డు తగులుతూనే ఉన్నాడు. స్పీకర్ మందలింపులు తలకెక్కడం లేదు. ప్రతిపక్ష నాయకుడు రఘురాంరెడ్డి నిమిషానికోసారి 'అధ్యక్షా!' అని అరుస్తున్నాడు. మధ్య మధ్యలో కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటున్నాడు. టివి కెమెరా తనవైపు ఉందో లేదో గమనిస్తున్నాడు. ముఖ్యమంత్రి ప్రసంగం అయ్యాక ప్రశ్నోత్తరాల కార్యక్రమం ఆరంభమైంది.

లక్సెట్టిపేటలో పేదల భూములను ప్రభుత్వం ఆక్రమించడంపట్ల తీవ్రంగా ధ్వజమెత్తాడు ప్రతిపక్ష నాయకుడు రఘురాంరెడ్డి.

"అధ్యక్షా! గతంలో మా ప్రభుత్వం రెండు వందల ఎకరాల భూమిని పేద వారికి ఉచితంగా పంచి పెట్టింది. ఇపుడీ ప్రభుత్వం వచ్చి వాటిని రద్దు చేయడం ఈ ప్రభుత్వ దగుల్బాజీ తనానికి నిదర్శం అని నేను మీకు మనవి చేసుకుంటున్నాను."

ముందు బెంచీలలోని అధికార పక్ష సభ్యులు ఒక్క సారిగా తిరగ బడ్డారు. గ్యాలరీలోవున్న సుబ్బరాజులో నీరసం మొదలైంది. ఎమ్మెల్యే సదానందం ఏం చేస్తున్నాడో చూద్దామని ప్రయత్నించాడు. ఆఖరి వరుసలో కూర్చున్న మరో ఎమ్మెల్యేతో పిచ్చాపాటి కబుర్లలో పడ్డాడు సదానందం. మధ్య మధ్యలో వళ్ళు ఊగేలా నవ్వుతున్నాడు.

"అధ్యక్షా! 'దగుల్బాజీ' అనే పదం అన్‌పార్లమెంటరీ అధ్యక్షా! గౌరవనీయ సభ్యుడు హుందాతనం మరిచిపోయి ప్రవర్తిస్తున్నారు. ఆ పదాన్ని రికార్డుల నుండి తొలగించ వలసిందిగా కోరుతున్నాను" అన్నాడో వామపక్ష సభ్యుడు.

"శాసన సభలో విమర్శించే హక్కు అందరికీ ఉంది. ఈ మాత్రం దానికే తట్టుకోక పోతే బయట జనాల దగ్గరకెళ్ళండి ఉమ్మేస్తారు...." కసిగా తిట్టాడు మరో సభ్యుడు.

ఆ మాటకి తారాజువ్వలా లేచాడు ముందు బెంచీలో కూర్చున్న వీర్రాజు. వీర్రాజు అధికార పక్షం ఎమ్మెల్యే. ఎదుటి వ్యక్తి తన పార్టీని గానీ, నాయకుణ్ణిగానీ, నిందించినా, పరుషంగా మాట్లాడినా సహించలేని నెంబర్‌వన్ స్వామి భక్తి పరాయణుడు. పట్నంలోని చిన్న మురికి వాడలో ఓ మారుమూల గల్లీనుండి అంచెలంచెలుగా ఎదిగి అసెంబ్లీకి చేరుకున్నాడు. అసెంబ్లీలో జరుగుతున్న గొడవని చాలా సేపటినుండీ గమనిస్తున్నాడు. సరైన కారణం కోసం ఎదురుచూస్తున్నాడు. ఆ సాకు రానే వచ్చింది. ఒక్క ఉదుటున లేచి నిలబడ్డాడు.

"ఏంర్రా ఉమ్మేసేది? దొం...లం... బయటికి రారా తేల్చుకుందాం" తొడగొట్టాడు వీర్రాజు.

ఆతనికి సపోర్టుగా మరో ఇద్దరు ఎమ్మెల్యేలు లేచారు. స్పీకర్ కూర్చోమని సైగ చేస్తున్నాడు. నెత్తి,నోరు కొట్టుకుంటున్నాడు. ప్రతిపక్ష సభ్యులందరూ లేచి నిల్చున్నారు. అందరూ ఒకేసారి మాట్లాడుతుండటంతో ఎవరేం చెప్పున్నారో వినిపించడం లేదు. అంతా గందరగోళంగా ఉంది. గ్యాలరీలో సుబ్బరాజు పరిస్థితీ అలాగే ఉంది. సదానందం కూడా వీర్రాజుకి మద్దతుగా ఏదో అరుస్తున్నాడు. ప్రతిపక్ష సభ్యులంతా స్పీకర్ పోడియం ముందు బైఠాయించారు. మధ్య, మధ్యలో టివి కెమెరా వైపు చూసి నవ్వుతున్నారు. చేతులూపుతున్నారు. మరో ఇద్దరు సభ్యులు మాత్రం చాలా సీరియస్ డిస్కషన్‌లో ఉన్నారు. చేతులు వెనక్కి కట్టుకుని ఒకరు, చేతులు పైకెత్తి ఒళ్ళు విరుచుకుంటూ మరొకరు వ్యాపార లావాదేవీలు మాట్లాడుకుంటున్నారు.

"నో! ఇలా బిహేవ్ చేస్తే నేనీ సభను నిర్వహించలేను. దయచేసి వెళ్ళి మీ సీట్లలో కూర్చోండి. టేక్ యువర్ సీట్స్ ప్లీజ్...." పదే పదే అభ్యర్థిస్తున్నాడు స్పీకర్. 'ఛీ ఇంత కన్నా మనూరి బళ్ళో పోరగాళ్ళు నయం. కొంచెం మాట వింటారు. ఛీ. బుద్ధి, గ్నానం లేదు ఈ మడుసులకి సణుక్కున్నాడు సుబ్బరాజు.

సభలో గొడవ రాను రాను రావణ కాష్టంలా రగులుకుంటోంది. తనకేం పట్టనట్లు పైళ్ళు చూసుకుంటూ కూర్చున్నాడు ముఖ్యమంత్రి. ప్రతిపక్ష సభ్యులకి మద్దతుగా ఓ పార్టీ ఏకైక సభ్యురాలు కూడా ముసుగు సవరించుకుంటూ పోడియం దగ్గరకు చేరుకుంది. అది చూసిన ఎమ్మెల్యే వరప్రసాద్ అదే అదనుగా ఏదో పనున్నట్లు స్పీడుగా స్పీకర్ పోడియం వైపుకు దూసుకొచ్చాడు. అలా రావడంలో కావాలనే ఆమెను ఢీకొన్నాడు.

"సారీ! " అంటూ వెనుకకు జరిగి మళ్ళీ తన సీట్లో కొచ్చి కూర్చున్నాడు. ఇది చూసిన మరో మహిళా ఎమ్మెల్యే వీరావేశంతో లేచి మైకు అందుకుంది.

"బాపూజీ, నెహ్రూజీ లాంటి మహనీయులు పోరాడి సాధించిన స్వాతంత్ర్యం మనది. ఈ దేశంలో స్త్రీకి అసెంబ్లీ ఇచ్చే గౌరవం ఇదేనా? నాదేశం పార్టీ సభ్యురాలు పోడియం దగ్గర నిల్చుంటే వరప్రసాద్‌గారు కావాలనే ఆమెను తగులుకుంటూ వెళ్ళారు. స్త్రీ శాసన సభ్యులంటే చులకన ఎందుకూ? అని నేను మిమ్మల్ని ప్రశ్నిస్తున్నాను" అంది ఎమ్మెల్యే సుబ్బలక్ష్మి.

"కూర్చోవమ్మా వాళ్ళూ వాళ్ళూ కొట్టుకు ఛస్తున్నారు. మధ్యలో నీ గోలేంటి?" అంటూ ఎడం చేత్తో సైగ చేశాడు హోం మంత్రి. వీర్రాజు గొడవ సద్దుమణగలేదు. అవతలి పక్షం అంబుజంకూడా తొడలు చరుస్తూ ముందుకు రావడంతో ఇరు పక్షాల సభ్యులూ పోగయి వారిని విడదీసే ప్రయత్నం చేస్తున్నారు. 'ఈనాకొడుకులు ఆగేదెపుడు? చర్చ జరిగేదెపుడు?' టెన్షన్‌తో చుట్ట వెలిగించబోయాడు సుబ్బరాజు. అక్కడే మఫ్టీలో ఉన్న సెక్యూరిటీ సిబ్బంది వద్దని వారించాడు.

"సభ్యులంతా ఎవరి సీట్లలో వారు కూర్చోకపోతే సభ వాయిదా వేయాల్సి ఉంటుంది. ప్లీజ్ .. వెళ్ళి మీ సీట్లలో కూర్చోండి" స్పీకర్ అభ్యర్థన.

నా దేశం పార్టీ అధ్యక్షురాలు, ఏకైక సభ్యురాలు భారతి లక్ష్మి తన స్థానంలోకి వచ్చి మైకు అందుకుంది.

"అధ్యక్షా ఒక మహిళా సభ్యురాలికి సభ ఇచ్చే గౌరవం ఇదేనా? నేను నిరసన తెలియచేయడానికి పోడియం దగ్గరకి వస్తే గౌరవనీయ సభ్యుడు వరప్రసాద్‌గారు కావాలనే తగులుకుంటూ వెళ్ళారు. ఆయనకూ నాకూ ఉన్న పాత కక్షల వల్లనే ఈ రకంగా ప్రవర్తించారు. నాకు న్యాయం చేయండి అధ్యక్షా! " మైకులో గొంతు చించుకుని అరుస్తోంది భారతి లక్ష్మి.

"చాల్లే.. ఇంకా తక్కువే చేశాడు. అదే నేనైతేనా..." వెనక బెంచీలోని అధికార పక్ష సభ్యుడొకడు గట్టిగా పళ్ళు బిగించాడు. భారతి లక్ష్మి తన గోడును తను మైకులో చెప్తూనే ఉంది.

వీర్రాజు, అంబుజంల పరిస్థితి శృతిమించి రాగాన పడింది. ఒకళ్ళ కాలర్లు, ఒకళ్ళు పట్టుకుని బూతులు తిట్టుకుంటున్నారు. విసుగెత్తిన స్పీకర్ మార్షల్స్‌కి ఆదేశాలు జారీ చేశాడు.ఆరుగురు మార్షల్స్ రంగ ప్రవేశం చేసి ఇద్దరినీ చెరోవైపు లాగి సీట్ల వైపు పంపించారు. లక్సెట్టిపేట భూ ఆక్రమణల గురించి ముఖ్యమంత్రి ఏదో వివరణ ఇవ్వబోతుంటే మళ్ళీ గొడవ ప్రారంభమైంది.

"ఛస్...దీనమ్మ! ఇది ఇప్పట్లో తెమలదు. లేరాబై... చాయ్ తాగొద్దాం" అని కిళ్ళీ నములుతున్న ఇద్దరు సభ్యులు లేచారు.

"ఉండు. ఉట్టిగనే పోవడమెందుకు? పన్లోపని వాకౌట్ చేస్తే మంచిగ మనవన్ను జూస్కోవచ్చు." అని టేబుల్ మీదున్న కాగితాలు చేతిలోకి తీసుకున్నాడు ఆ సభ్యుడు.

"అధ్యక్షా! గతంలో ఎన్నడూ లేని విధంగా అసెంబ్లీలో జరుగుతున్న ఈ గొడవకి నేను సిగ్గుతో తల దించుకుంటున్నాను. ప్రభుత్వ వైఖరికి నిరసనగా వాకౌట్ చేస్తున్నాను" అంటూ కాగితాలు చింపి గాలిలోకి ఎగరేసి చేతులు దులుపుకుని నిర్లక్ష్యంగా వెళ్ళిపోయాడా ఎమ్మెల్యే. ఆతనిని అనుసరిస్తూ ఆ పక్క సభ్యుడు కూడా బయటకి నడిచాడు.

కొద్ది సేపటికి సభ శాంతించింది. ముఖ్యమంత్రి లేచాడు. తన వివరణ కొనసాగించబోయాడు. యధాప్రకారం రఘురాం రెడ్డి అడ్డుపడ్డాడు. స్పీకర్ ఏదో చెప్పబోతుంటే-

"మా వాదనలని మమ్మల్ని చెప్పనీయండి అధ్యక్షా!" గొంతు చించుకుని చిరాకు పడుతున్నాడు రఘురాం రెడ్డి. మాట్లాడమని ముఖ్యమంత్రికి సైగ చేసి రఘురాం రెడ్డి మైకు గొంతు నొక్కేసాడు స్పీకర్.

ప్రతిపక్ష సభ్యులంతా ఒక్కసారిగా లేచి నిలబడ్డారు.

"మాట్లాడే స్వేచ్ఛలేని ఈ అసెంబ్లీలో ప్రభుత్వం ఎంత చెప్తే అంతలా వ్యవహరిస్తున్న ఈ సభనుండి వాకౌట్ చేస్తున్నాం" అని చేతిలోని మైకుని విరిచిపడేసి ఆవేశంగా వెళ్ళిపోయాడు రఘురాం రెడ్డి. ఆతని వెంటే మొత్తం ప్రతిపక్షం వాకౌట్ చేసింది.

స్పీకర్ ఒక గ్లాసు నీళ్ళు గటగటా తాగేసి 'అమ్మయ్య' అని ఊపిరి పీల్చుకున్నాడు. గ్యాలరీ లో సుబ్బరాజు చంకలో బ్యాగ్ సర్దుకుని వెళ్ళిపోవడానికి సిద్ధపడ్డాడు. సరిగ్గా అపుడు లేచాడు సుబ్బరాజు తాలూకు ఎమ్మెల్యే సదానందం.

"అధ్యక్షా! " అంటూ చొక్కా సవరించుకుని లేచి నిలబడ్డాడు. రెణ్ణిమిషాలు మౌనం... సభ అంతా ఆతృతగా ఎదురు చూస్తోంది. ఏం చెప్తాడా అని.

"అధ్యక్షా!" మరోసారి అన్నాడు సదానందం.సుబ్బరాజు ముఖంలో వెయ్యి ఓల్టుల కాంతి. తన సమస్య తీరబోతోంది. రైతు సోదరులెవరూ ఇక ఆర్థాకలితో చచ్చిపోనక్కర్లేదు. ఆత్మ హత్యలు చేసుకోనక్కర లేదు. ఈ ఆలోచనతో ఠక్కున మళ్ళీ సీట్లో కూర్చున్నాడు.

"సభలో పొద్దుటనుండీ జరిగిన పరిణామాలు నన్ను కలవర పెట్టాయి అధ్యక్షా! గతంలో ఎన్నడూ ఇలా జరగలేదు. అసెంబ్లీ అన్న తర్వాత కొన్ని నియమ నిబంధనలుంటాయ్. వాటిని కాలరాసి ప్రతిపక్ష సభ్యులు ఇష్టానుసారం వ్యవహరించారు" అన్నాడు సదానందం.

" విషయం చెప్పండి" గద్దించాడు స్పీకర్.

"నేనిక్కడ స్పీచ్ ఇవ్వడానికి రాలేదు అధ్యక్షా! ప్రజా సమస్యలని చర్చించి పరిష్కరించాల్సిన మనం విలువైన సమయాన్ని దుర్వినియోగం చేశాం." మళ్ళీ కొద్ది నిమిషాల మౌనం.

"అసెంబ్లీ ఉన్నది ప్రజల కష్ట సుఖాలు చర్చించడానికే అని మీకు మనవి చేస్తున్నాను. చర్చించాల్సిన విషయాలు ఎన్నో ఉండిపోయాయ్. గౌరవనీయ సభ్యులు హుందాతనం మరిచిపోయి బాధ్యతా రాహిత్యంతో వ్యవహరించారని ఈ సందర్భంగా నేను మీకు మనవి చేస్తున్నాను." సదానందం సుదీర్ఘోపన్యాసం అలా సాగుతోంది.

**"అసెంబ్లీ ఉన్నది ప్రజల కష్ట సుఖాలు చర్చించడానికే అని మీకు మనవి చేస్తున్నాను. చర్చించాల్సిన విషయాలు ఎన్నో ఉండిపోయాయ్. గౌరవనీయ సభ్యులు హుందాతనం మరిచిపోయి బాధ్యతా రాహిత్యంతో వ్యవహరించారని ఈ సందర్భంగా నేను మీకు మనవి చేస్తున్నాను." సదానందం సుదీర్ఘోపన్యాసం అలా సాగుతోంది. సమయం ఒంటి గంట దాటడంతో 'సభను రేపటికి వాయిదా వేస్తున్నట్లు' ప్రకటించి వెళ్ళిపోయాడు స్పీకర్.**

సమయం ఒంటి గంట దాటడంతో 'సభను రేపటికి వాయిదా వేస్తున్నట్లు' ప్రకటించి వెళ్ళిపోయాడు స్పీకర్. సుబ్బరాజు నీరు కారిపోయాడు. నిలువునా కూలిపోయాడు. ఏ పనికోసం అయితే తాను వచ్చాడో ఆ పని జరగలేదు. 'అక్కడ ఆత్రంగా ఎదురు చూసే తన మనుషులకు ఏం సమాధానం చెప్పాలి? ' కాళ్ళీడ్చుకుంటూ చెట్టు కిందకి చేరిన సుబ్బరాజు దగ్గరకి వచ్చాడు సదానందం.

"చూశావా? అలా వుంటుందోయ్! అసెంబ్లీ అంటే. సరే రేపు కలుద్దాం. రేపు నీ సమస్యని చర్చకి పెట్టిస్తాను ఉంటానోయ్!" అని భుజం తట్టి నీలిరంగు అంబాసిడర్ కారెక్కి తుర్రుమన్నాడు ఎమ్మెల్యే సదానందం. ఆ కారు లేపిన దుమ్ములో నోరు వెళ్ళబెట్టుకుని నిలబడ్డాడు సుబ్బరాజు.